# తృతీయప్రసంగము.

గతప్రసంగానంతరమున, శ్రీనిత్యానందస్వామివారు రెండు సంవత్సరముల 3 మాసములనుండియు 'పీరడియా' లోనే ఉంటున్నారని తెలిసికొని శ్రీప్రకాశానందస్వామివారు వారికడకు వెళ్ళిరి. ఆరోజు సాయంకాలమున శ్రీనిత్యానందస్వామివారి సన్నిధిని కొందరు భక్తులు చేరియుండిరి. శ్రీప్రకాశానందస్వామివారు అక్కడకు వచ్చినట్లు తెలిసి 'పీరడియా' రాజుగారు, వైద్యరాజ గోపాలజీ భాయీ—ఈఇరువురున్ను అక్కడకు వచ్చిరి.

రాజు:—"చాలా రోజులనుండి తమ దర్శనము చేయవలెనను కోరిక కలిగెను. అది నేటికి సిద్ధించినది" అని పలుకుచు కొన్ని కానుకలను శ్రీప్రకాశానందస్వామివారికి సమర్పించెను. అది చూచి వారిట్లు పలికిరి:—

స్వా॥ ప్ర॥:—"ఒక పగటివేషగాడు సన్యాసివేషమును ధరించి ఒక రాజుగారి సభలోనికి వెళ్ళెను. అతనిని జూచి రాజుగారు, సభ్యులు అందరు నిలబడిరి. రాజుగారు నమస్కరించి యాసన్యాసిని సింహాసనముపై కూర్చొనుడని ప్రార్థించెను. కాని ఆతడు ఉన్నతాసనముపై కూర్చొనుట ఆశ్రమధర్మము కాదని చెప్పి, రాజుగారిని ఒప్పించి అందరితోపాటు సామాన్యపు ఆసనముపై కూర్చొనెను. పిమ్మట ఆసన్యాసి రాజనీతిని చక్కగా ఉపదేశించెను. అప్పుడు రాజుగారు ఆతనిని సత్కరించుటకు బంగారు పళ్లెము నిండ రత్నములు పోసి కానుకగా సమర్పించెను. అది చూచి యాసన్యాసి యిట్లు పలికెను:—

"ఓ రాజా, మీదృష్టిలో రత్నములు, వెండి బంగారములు ఉత్తమద్రవ్యములు. కాని మాదృష్టిలో అవన్నియు మట్టితో సమానములు. సన్యాసికి ద్రవ్యాదులను సమర్పించుట మీకు ధర్మము

కాదు. వాటిని స్వీకరించుట మాకును ధర్మము కాదు'' అని పలికి వెళ్లిపోయెను.

మరియొక రోజున ఆపగటివేషగాడే నర్తకివేషమును ధరించి తబల, సారంగి మొదలగు వాద్యములతో రాజసభకేగి రాజుగారికి సలాముచేసి నృత్యముచేసెను. రాజు వివేకి. ఈనర్తకి పూర్వము సన్యాసివేషముతో వచ్చినవ్యక్తియే అని గ్రహించెను. నృత్యము పూర్తి అయినతరువాత రాజుగారు వెయ్యిరూపాయలు బహుమతి నిచ్చెను. ఆపగటివేషగాడు, 'మహాప్రభూ! ఇది నాకు చాలదు. ఇంకను అధికముగా నిప్పించగోరెదను' అని మనవిచేసికొనెను. అంతట రాజుగారు 'ఆరోజున సన్యాసివేషముతో వచ్చినప్పుడు రత్నముల నియ్యగా నిరాకరించితివి. అర్ధరాజ్యమును కోరినా ఆరోజున ఇచ్చియుండెడివాడను. నేడు ఎక్కువ కావలెనని ఏల కోరుచున్నావు?' అనెను. అంతట పగటివేషగాడు, 'మహాప్రభూ! ఆరోజున అర్ధరాజ్యమునే కాదు, రాజ్యమునంతను ఇచ్చినను తీసికొనెడివాడను కాను. అది సన్యాసివేషము. అప్పుడేమైనా తీసికొనినచో ఆ వేషము యథార్థమని గ్రహింపబడదు. అంతేకాదు. వేషమునకు కళంకమును కూడా తెచ్చిపెట్టినవాడ నగుదును,' అని చెప్పెను.

ఇటులనే నేను సన్యాసివేషమును వేసికొంటిని. మీరిచ్చు కానుకలను పుచ్చుకొని ఆ వేషమును నేనేల కళంకపరచవలెను?''

రాజు:—''తమరు ప్రప్రథమముగా దర్శన మిచ్చినందున మేము ఇట్లు కొంత వివేకముతో ప్రవర్తించుట ధర్మముకదా!''

స్వా॥ ని॥:—''ఇది వివేకము కాదు. అవివేకము. పగటివేషగాడు సన్యాసివేషమును ధరించినంతమాత్రముననే ద్రవ్యమును స్వీకరించనప్పుడు నిజమైన సన్యాసి ఎట్లు స్వీకరించును?''

రాజు:—''సన్యాసికి ద్రవ్యనిషేధము ఎందుకు?''

స్వా॥ ప్ర॥ :—ద్రవ్యము మాకు బ్రహ్మవిద్యామార్గమున విఘ్నము కలుగజేయును. అందుకే మనువు 'రజసస్త్వర్థ ఉచ్యతే'—ద్రవ్యేచ్ఛ రజోగుణ లక్షణము, అని చెప్పినాడు. అంతఃకరణమున రజోగుణ మున్నంతకాలము యోగాభ్యాసము చేసినను అది సత్త్వ గుణప్రధానము కానేరదు. అంతఃకరణము సత్త్వగుణప్రధానము కానంతవరకు జ్ఞానము కలుగుట అసంభవము. కావున మాకు ద్రవ్య పరిగ్రహము నిషిద్ధము. మీరు మాకు ద్రవ్యమును సమర్పించిన, మాకు విఘ్నము, మీకు దానిని కలుగజేసిన దోషమును, సంభవించును. వ్యాసస్మృతియందు ఇట్లు చెప్పబడినది—

*యతీనాం కాఞ్చనం దత్త్వా తామ్బూలం బ్రహ్మచారిణామ్ ।*
*స్తేనానామభయం దత్త్వా స దాతా నరకం వ్రజేత్ ॥*

"యతులకు కాంచనమును, బ్రహ్మచారులకు తాంబూలమును చోరులకు అభయమును ఒసగినవాడు నరకమును పొందును."

ద్రవ్యములు మొదలగు మాయాజన్యపదార్థములు రజస్తమో గుణములను పెంపొందించును. వీటితో బ్రహ్మాకారవృత్తి కలుగదు. ఆరూఢుడు పతితుడు అగును.

గోపాలజీ భాయీ శ్రీనిత్యానందస్వామివారి నిట్లు ప్రశ్నించెను—

"వీరు చింపిరిగుడ్డలను ఇంత ఎక్కువగా ఏల ప్రేమింతురు?"

## అ వ ధూ త ద శ

స్వా॥ ని॥ :—"శ్రీప్రకాశానందస్వామివారు అవధూతదశ యందు ఉన్నారు. అవధూతగీతయందు ఇట్లు చెప్పబడినది—

*రథ్యాకర్పటవిరచితకన్థః పుణ్యాపుణ్యవివర్జితపన్థః ।*
*శూన్యాగారే తిష్ఠతి నగ్నః శుద్ధనిరఞ్జనసమరసమగ్నః ॥*

"త్రోవలో పడియున్న చింపిరిగుడ్డల బొంత కట్టుకొని, పుణ్య పాపములకు అతీతులయి, అవిద్యారహితమైన శుద్ధసమరసమగు బ్రహ్మతత్త్వమున నిమగ్నమైనవాడు శూన్యమందిరమున నగ్నదశ యందు ఉండును."

ఈలక్షణములు శ్రీప్రకాశానందస్వామివారియందుఉండుటచే వారు చింపిరిగుడ్డలను. ప్రేమించుటలో ఆశ్చర్యము లేదు."

స్వా॥ ప్ర॥ :—మీారన్నట్లు నేను అవధూతను కాను, అవ ధూర్తుడను ఏలనన :—

*నరాణాం నాపితో ధూర్తః పక్షిణాం చైవ వాయసః।*
*చతుష్పదాం శృగాలస్తు స్వేచ్ఛాచారీ తపస్వినామ్॥*

"మనుష్యులలో క్షౌరము చేయువాడు ధూర్తుడు. పక్షులలో కాకి ధూర్తము. చతుష్పాత్తులయిన జంతువులలో నక్క ధూర్త మైనది. తపశ్శాలురలో స్వేచ్ఛగా సంచరించువాడు ధూర్తుడు."

స్వా॥ ని॥ :—సన్యాసి మఠము నేర్పరచుకొని, భూమి, బండి, గుఱ్ఱము మొదలగునవి ఉంచుకొనుటయు, ద్రవ్యాదిపదార్థములను సంగ్రహించుటయు స్వేచ్ఛాచారము అనబడును. తమచే 'ధూర్తుడు' అనుపదము పొగరుమోతుతనముగా ప్రవర్తించువానిపట్ల ఉపయో గింపబడినది. మాయతో పొగరుమోతుతనముగా మీారు ప్రవర్తించు చున్నారు. ఈవిషయము యథార్థము. నేను కూడా ఇటువంటి ధూర్తుడ నయితే బాగుండును.

ఇది విని అందరు నవ్వసాగిరి.

## భగవంతునకు ప్రియుడు

శ్రీప్రకాశానందస్వామివారికి చాలా కాలమునుండి పరిచితు లయిన రామపురి స్వామి మహారాజుగారు ఆరోజులలో రాజగృహ

ములో ఉండెడివారు. వారు శ్రీనిత్యానందస్వామివారు మొదలగు వారందరు నక్కడ కూర్చొనియుండగా వచ్చి ఇట్లు పలికిరి:—

"ఒకప్పుడు శ్రీప్రకాశానందస్వామివారు గోండలులో ఉండిరి. నేను వారి దర్శనమునకు వెళ్ళితిని. అప్పుడే 'పీఠడియో' దయచేయుడని వారిని ఎంతో వేడుకొంటిని. కాని శ్రీవారు అంగీకరించలేదు. 'అరణ్యములోనికిగాని, అట్టి మరియొక ప్రదేశమునకుగాని రమ్మనిన వచ్చెదను. కాని దర్బారులోనికి రాను అన్నారు. అప్పుడు నాకెంతయో కష్టముతోచినది. 'ఇంత కఠోరహృదయులై పోవుటకు కారణమేమి?' అని అనుకున్నాను.

మరియొకసారి రెండుమూడు సంవత్సరముల తరువాత దర్బారుసాహబునుండి ఒక ఉద్యోగియైన బ్రాహ్మణగృహస్థుడు రాజకోటకు వెళ్ళుచుండెను. అప్పుడు ఆయనద్వారా 'తమరు దయచేయుచో కారు పంపగలను' అని శ్రీ స్వామివారికి కబురంపితిని. ఆయనకు కూడా 'రాను' అను సమాధానమే చెప్పిరి. ఇప్పుడు శ్రీనిత్యానందస్వామివారున్నందున శ్రీవారు విచ్చేసిరి."

అంతట శ్రీ ప్రకాశానందస్వామివారు ఈక్రింది కబీరువాక్యమును జ్ఞప్తికి తెచ్చిరి.

*రాజద్వార న జాఇయే, జో కోటిక మిలే హేమ్,*
*సుపచ భగతకే జాఇయే ఏ విష్ణుభక్తాకా నేమ్.*

"రాజదర్బారునకు వెళ్ళరాదు. ఎంతధనము లభించినను వెళ్ళరాదు. శ్వపచుడు, అనగా కుక్కమాంసమును భుజించువాడు, అయినను సరే, అతడు భగవంతునకు భక్తుడైనచో అతని ఇంటికి వెళ్ళవచ్చును. ఏలనన, భగవంతునకు బీదలు ప్రియమైనవారు."

## భక్తాధీనుడు

స్వా॥ ని॥:—రాజు అయినా సరే, దరిద్రుడు అయినా సరే. భక్తి ఎక్కడఉంటే, అక్కడకు వెళ్ళవలెను. భగవంతుడు భక్తాధీనుడు,

రాజు:—శ్రీనిత్యానందస్వామివారు నిజము చెప్పుచున్నారు. మేము భక్తి కలిగియున్నచో తమరు దయచేయవలెను గదా!

స్వా॥ ప్ర॥:—మీకు భక్తి ఉండవచ్చు. అది మాకు దురదృష్టముగా పరిణమించవచ్చు. మీవంటివారితో సంబంధము ఏర్పడితే మీవలె ఆహారవిహారములు, వస్త్రువాహనములు మొదలగువానిని పొంది విలాసజీవితమునకు అలవాటు పడెదము. సంసారులవలన పాడైన విరక్తుల ఉదాహరణములు అనేకములు కలవు.

రాజు:—అయితే తమసాంగత్యమువలన మేము పాడవమా?

స్వా॥ ప్ర॥:—మాసాంగత్యమువలన తమరు పాడగుట మంచిదే. కాని తమసాంగత్యమువలన మేము పాడగుట చాలాతప్పు.

స్వా॥ ని॥:—అది నిజమే. మాసాంగత్యమువలన తమరు పాడయిన స్వర్గము లభించును. మీసాంగత్యమువలన మేము పాడయిన నరకములో పడుదుము. (అందరు నవ్వసాగిరి) తీవ్రవైరాగ్యము కలవారు సంసారిసమాగమమువలన పాడవరు. మావంటి మందవైరాగ్యము కలవాడు పాడగును. 'అఖా' కవి ఇట్లు చెప్పెను:—

*సత్యో వైరాగ్యో స్వామీనే హృదే, మహాపురుష సర్వో ఏమ్ వదే;*
*జే వైరాగ్యో దేఖాడీ కరే, ఏ తో మన కేరీ మశ్కరీ;*
*పలకే పలకే పలటే ఢంగ్, ఏ తో అఖా మాయా నా రంగ్.*

"నిజమగు వైరాగ్యము హృదయమున ఉండును అని మహాపురుషులు చెప్పుదురు. దంభవైరాగ్యము కలవాడు తన మనస్సును మోసము చేయుచున్నాడు. నిమిషనిమిషమునకు రకరకాల మార్పుల ప్రదర్శనము మాయారంగము."

ఇట్లు పైకి ఒకవిధముగాను, లోపల మరియొక విధముగాను ఉండువాడు సంసారుల సాంగత్యమును కోరును; మాయావశు

డగును. ఇహలోకమునందును, పరలోకమునందును అనుభవింపబడు భోగములను కాకిరెట్టతో సమానముగా చూచువాడు మాయకు లోను కాడు. ఇట్టి మహాపురుషునకు ఎప్పుడును, ఏపదార్థమునందును మోహము, మమకారము కలుగదు. మందవైరాగ్యముకల మనుష్యునకు పదార్థములను చూచినందున చిత్తవృత్తి పదార్థములందు ప్రసరించినను, ఆతడు ఆవృత్తిని ఆపుచేసికొొన శక్తి కలిగియుండును. అట్టివారు అభ్యాసముద్వారా తీవ్రవైరాగ్యము నొంద సమర్థులగుదురు. కాని కేవలము పూజాప్రతిష్ఠలకొరకు కపటవైరాగ్యము నవలంబించినవారు పదార్థములు లభించనంతవరకు వైరాగ్యమును అభినయింతురు. అవి లభించినతోడనే పూర్తిగా సంసారులగుదురు. భక్తవరుడు 'అఖా' ఇట్లు చెప్పెను:—

*మూండ్ మూండావీ హరినే కాజ్, లోక పూజే నే కహే మహారాజ్;*
*మన్ జాణే హరియే కృపాకరీ, మాయామాం లపటాణా ఫరీ;*
*సౌనే మన్ తే కరే కల్యాణ్, అఖా ఏనే హరి మల్యావీ హాణ్*

"హరికొరకు తల గొరిగించుకొంటిని. స్వామీ, స్వామీ అనుచు ప్రజలు పూజించి గౌరవించిరి. పూజాగౌరవములు కలిగినట్లు మనస్సులో భావించుట. నిజమునకు మాయలోనికి దిగజారినాడు. ఇతరులు వీనిని పురోగమించుచున్నట్లు భావించుచున్నారు. వీడు హరికి దూరమైనాడు అని అఖా అంటున్నాడు."

స్వా॥ ప్ర॥:—పూర్ణవైరాగ్యవంతుడయి, ఏకాంతమున కూర్చొని యోగాభ్యాసముచేసిన జ్ఞానము అచిరకాలములో కలుగును. కాని ఇతరులకు చూపుటకు మాత్రమే వైరాగ్యమునొంది, అంతరంగమున వివిధములగు మాయాజన్యపదార్థములయందు ఆశ కలిగియున్నచో ఏకాంతమునందు ఎంతకాలముగా కూర్చొనియున్నను, ఎంత యభ్యాసము

చేసినను యోగసిద్ధి కలుగదు. పైగా అధఃపతనము కలుగును. ఈవిషయమున శ్రీశంకరభగవానుడు ఇట్లు నుడివెను:—

*ఆపాతవైరాగ్యవతో ముముక్షూన్, భవాబ్ధిపారం ప్రతియాతుముద్యతాన్ ।*
*ఆశాగ్రహో మజ్జయతేఽన్తరాలే, నిగృహ్య కణ్ఠే వినివర్త్య వేగాత్ ॥*

"సంసారసముద్రమును దాట నుద్యమించిన మందవైరాగ్యముగల—ఆరంభవైరాగ్యముగల—ముముక్షువులను, ఆశ యను మొసలి మెడపట్టుకొని వేగమున వెనుకకు మరల్చి నడిసముద్రమున ముంచివేయును."

అంతరంగమున వివిధములగు ద్రవ్యాదిమాయాపదార్థములందు ఆశకలిగి పైపైన వైరాగ్యమునొందిన ముముక్షువులు ఏకాంతమునందు కూర్చొనినను, యోగాభ్యాసము చేసినను మాయ అను దుర్గమసముద్రమును దాటి భగవంతుని పొందలేరు. ఈవిషయమున తుకారామ్ "ఆశాతృష్ణలకు కట్టుపడిన మనుష్యుడు నారాయణుని ఎట్లు తెలిసికొనగలడు? ఆతడు రోజురోజు తన ఇంద్రియములను సేవించుటయందు తత్పరుడగును. ఏవిషయము వైపు మనస్సు మరలిన ఆవిషయమును పొందుటకు ప్రయత్నించును. అందువలన చిత్తము భ్రమించును. పిచ్చివానివలె ఇష్టము వచ్చినట్లు సంచరించును. అతనికి యుక్తము, అయుక్తము అను వివేకము ఉండదు" అని చెప్పియుండెను.

## పంక్తిభేదము మహాపాపము

అంతట అచ్చట ఉన్నవారి కందరికి పుచ్చకాయముక్కలను కోసి ఇచ్చిరి. శ్రీనిత్యానందస్వామివారికిని, శ్రీప్రకాశానంద వారికిని [illegible]చిగల మధ్యముక్కలను పళ్లెములో ఉంచి యిచ్చిరి. ఇది [illegible] ప్రకాశానందస్వామివారు ఇట్లు చెప్పిరి—

"ఒకరాజు తనభవనమున పై అంతస్థులో కిటికీవద్ద కూర్చొని పండ్లు తినుచు పెచ్చులను, గింజలను బయటకు పారవేయుచుండెను. ఒక పిచ్చివాడు అది చూచి ఆపెచ్చులను తీసికొని తినసాగెను. కాపలావారు వానిని బెదిరించి వెళ్ళిపోమనిరి. ఆపిచ్చివాడు వినిపించుకోకుండా తినుచుండెను. సిపాయిలు వానిని కొట్టసాగిరి. ఏడ్చుటకు బదులు ఆపిచ్చివాడు పకపక నవ్వసాగెను. రాజు ఇది చూచి ఆశ్చర్యపడెను. ఆపిచ్చివానిని రప్పించి నవ్వుటకు కారణమేమి యని రాజు అడిగెను. ఆపిచ్చివాడు ఇట్లు సమాధానము చెప్పెను— "పెచ్చులు తినినవానికే ఇన్ని దెబ్బలు తగిలితే గుంజు తినినవానికి ఎన్ని దెబ్బలు తగులునో అను ఆలోచన తట్టి నవ్వు వచ్చినది." ఆతడు ఎవడో జ్ఞాని అని రాజు తెలిసికొని అతని కాళ్ళమీద పడి క్షమార్పణ వేడుకొనెను."

ఇది విని అందరు నవ్విరి. శ్రీనిత్యానందస్వామివారు పంక్తిభేదము మహాపాపమని చెప్పిరి.